# పాత జ్ఞాపకాలు

## (జయకాంతన్ కథ)

### అనువాదకుని ముందుమాట

ఈ కథలో అరవైఐదేళ్ళు దాటిన ఇద్దరు మగవాళ్ళు - మిత్రులు - నలభైఐదు సంవత్సరాల ఎడబాటు తరువాత, అకస్మాత్తుగా, కలుసుకుంటారు. ఆ రెండు పాత్రల అన్వేషణలో మనం చూసే ధోరణి, వైఖరి, తీరు ఎంత కొత్తగా కనిపిస్తున్నాయి! వృద్ధాప్యంలే కనబడే లక్షణావలక్షణాలు ఎన్ని రకాలు!

జయకాంతన్ ఈ కథని 1968లో 'ఆనంద వికటన్' పత్రికలో రాసారు; అప్పుడతనికి ముప్పైఐదు కూడా నిండలేదు. అప్పుడే వయసు చెల్లినవారి జీవితశైలిలో దాగియున్న పరిమాణాలని అతను పరిజ్ఞానంతో వెల్లడిచేసే తీరు, అవగాహన మెచ్చుకోతగ్గవి.

ఈ కథలో వచ్చే రంగమణి ఒక అపూర్వమైన పాత్ర. అటువంటి మనిషిని కలుసుకుంటే మనకెలావుంటుంది? అసహ్యమేస్తుందా? 'వీడెవటో ఒక old dirty man లాగ కనిపిస్తున్నాడే?,' అనే ఏవగింపు కలుగుతుందా? నాకూ మొట్టమొదట అలాగే తోచింది. నా పక్షపాతం కొంచెం పక్కన పెట్టి ఈ కథ చాలా సార్లు చదివాను; రంగమణి ఒక multi-faceted character అని తెలుసుకున్నాను. Charles Colt అనే రచయిత అన్నారుగా, 'Man is an embodied



paradox, a bundle of contradictions, అని?. అది ఎంత వాస్తవమని మనకి రంగమణి పాత్ర చెప్తోంది. రంగమణిలోనూ, మానవత్వం, కనికరం ఉన్నాయని గ్రహిస్తే మనం అతన్ని బాగా అర్థం చేసుకోగలం. చివరికి శర్మగారు కూడా విముఖంగా ఆ నిజాన్నే గ్రహించారు; తన జీవితమంతా ఒక అబద్ధమేమో అనే ప్రశ్న అతని మనసులో రంగమణిని కలుసుకున్న తరువాతే తోచింది. నిమ్మళంగా తన Comfort Zone ని వదలడానికి ఇష్టం లేకనే శర్మ తిరిగి రంగమణిని బీచులో కలుసుకోలేదని మనకి అర్థమౌతుంది.

*"కాచుకోనీ! . . . . ఎవరు కాచుకొని ఉండలేదు?"*

ఇద్దరి పాత్రల మనోభావాలని ఈ ఆఖరి వాక్యం నిరూపించుతోంది. వృద్ధాప్యంలో ఇద్దరూ 'కాచుకోనే' ఉన్నారు. కాని అందులో ఎంత భిన్నత్వం! అనంత శర్మకి 'సరే, అంతా ఐపోయింది,' అనే మౌనాంగీకారం; 'నాకోసం రోజు ఒక కొత్త పువ్వు పూస్తోంది' అని రంగమణి చింతన.

జయకాతన్ రాసిన మరి కొన్ని కథల్లాగ 'పాత జ్ఞాపకాలు' కూడా వివాదాస్పదమైనది. "ఇలాంటి కథలు చదివితే మా పిల్లలు ఏమవుతారు?" అని కొందరు పాఠకులు మొరబెట్టకున్నారట. వాళ్ళకి జయకాంతన్ చెప్పనది ఇదే: "వాళ్ళెవరూ నా కథలు చదవనక్కరలేదు. ఐతే, నా కథలు పెద్దవారుమాత్రమే చదవాలని నేనను. వయసులోకాదు, మనసులో పక్వముంటేనే నా కథలు బోధపడతాయి," అని అన్నారు.